సార్.. ఎక్కడున్నారు..?

- వన్ బీ లేకుంటే రెన్యువల్ చేయరట
- రెండు నెలలుగా తిరుగుతున్నాం..
- కార్యాలయాలకు రండి సార్..
- ఎన్నికల విధుల్లో అధికారులు బిజీ బిజీ
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ



ఖాళీగా ఉన్న తహసీల్దారు కుర్చీ



ఖాళీగా ఉన్న డీటీ, ఆర్ఐ, కుర్చీలు

విడపనకల్లు, మే 15: పంట రుణాల రెన్యువల్‌కు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వన్ బీ అడంగల్ కోసం మార్చి నుంచి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఆన్‌లైన్‌లో వన్‌బీలు రావటంలేదు. విడపనకల్లు మండలంలో సమస్య తీవ్రంగా ఉంది. ప్రతి రోజూ మండల కేంద్రానికి వచ్చివెళ్లేందుకు చార్జీలు వంద నుంచి రెండొందలు ఖర్చు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. రెన్యువల్ గడువు దాటితే బ్యాంకులో అప్పు మొత్తం చెల్లించాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. 'పాస్ బుక్‌లో సర్వే నంబరు ఉంటే ఆధార్ లింక్ అయ్యి ఉండదు. ఆధార్ లింక్ అయ్యి ఉంటే సర్వే నంబరు ఉండదు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు కనిపించటం లేదు. ఎన్నికల విధుల పేరిట ఇన్నాళ్లు తిరిగారు. కిందిస్థాయి అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. డీటీ, ఆర్ఐ, వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లు.. ఏ ఒక్కరూ కార్యాలయంలో ఉండటంలేదు. మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి..?' అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ తహసీల్దారు కార్యాలయానికి వస్తున్నామని, సాయంత్రం వరకూ చెట్లు నీడన కూర్చొని తిరిగి వెళుతున్నామని అంటున్నారు.

మార్చి నుంచి తిరుగుతున్నా..



నాకు పాస్‌బుక్‌కు ఆధార్ లింక్ చేయటం లేదు. దీంతో వన్‌బీ అడంగల్ రావటం లేదు. బ్యాంకులో పంట రుణం రెన్యువల్ కోసం మార్చి నెల నుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. ఎన్నికల విధుల్లో ఉన్నామని చెప్పి.. అధికారులు ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. పోలింగ్ పూర్తి అయింది.. ఈ రోజు వస్తారేమో అనుకున్నాను. ఒక్క అధికారి కూడా కార్యాలయానికి రాలేదు.

- వన్నూరమ్మ, కరకముక్కల

ఒక్కరూ లేరు..

పోలింగ్ ముగిసి రెండు రోజులు దాటినా అధికారులు కార్యాలయానికి రాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లోనూ ఏ ఒక్క అధికారీ ఉండటం లేదు. మాళాపురం గ్రామ సచివాలయానికి కొట్టాలపల్లి, మాళాపురం, విడపనకల్లు, ఆర్ కొట్టాల రైతులు వన్‌బీ అడంగల్ కోసం బుధవారం ఉదయం 11 గంటలకు వెళ్లారు. సచివాలయంలో ఒక్కరూ లేరు. ఆ తరువాత వచ్చినా.. వన్ బీ ఇవ్వటానికి బాండ్లు లేవని వెనక్కి పంపుతున్నారు. మాళాపురం సచివాలయానికి మధ్యాహ్నం 3 గంటలు దాటినా ఒక్క అధికారీ రాలేదు. దీంతో రైతులు సచివాలయం ఎదుట నిలబడి నిరసన తెలిపారు.

బ్లాక్ చేశారు..



నాకు ఎకరం పొలం ఉంది. పాస్‌బుక్ ఆన్‌లైన్‌లో రాకుండా బ్లాక్ చేసి కూర్చున్నారు. బ్యాంకులో పంట రుణం రెన్యువల్‌కి వన్‌బీ అడంగల్ రావడం లేదు. నా ఖాతాను బ్లాక్ చేశారని చెబుతున్నారు. మా ఊరి నుంచి రోజూ రూ.50 ఖర్చు పెట్టుకుని తహసీల్దారు కార్యాలయానికి వస్తున్నాను. రెండు నెలల నుంచి ఒక్క అధికారీ దొరకటం లేదు.

- గౌరమ్మ, కరకముక్కల

ప్రదక్షిణ చేస్తున్నా..



విడపనకల్లు కెనరా బ్యాంక్‌లో పంట రుణం తీసుకున్నాను. ఈ నెలలో రెన్యువల్ గడువు ముగుస్తుంది. ఏప్రిల్ నుంచి రోజూ తహసీల్దారు కార్యాలయానికి వస్తున్నాను. అధికారులు ఎవరూ కనిపించడం లేదు. సిబ్బందిని అడిగి వెనుదిరుగుతున్నాను. పోలింగ్ ముగిసింది. ఇకనైనా మా గురించి అధికారులు ఆలోచించాలి.

- గంగమ్మ, విడపనకల్లు

ఎన్ని రోజులు తిరగాలి..?



రోజూ 20 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి విడపనకల్లుకు వస్తున్నాను. ఇక్కడ ఒక్క అధికారీ ఉండరు. వన్ బీ అండగల్ ఉంటేనే పంట రుణాలను రెన్యువల్ చేస్తామని బ్యాంకు అధికారులు అంటున్నారు. అవి ఇవ్వటానికి రెవెన్యూ కార్యాలయంలో అధికారులు లేరు. ఎప్పుడు వస్తారో తెలియదు. రెన్యువల్ గడువు పూర్తి అయితే రుణం మొత్తం కట్టాల్సి వస్తుంది.

- హనుమంతు, డొనేకల్లు

చార్జీలకు అప్పు చేస్తున్నా..



వన్ బీ కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. చార్జీల కోసం రోజూ అప్పు చేయాల్సి వస్తోంది. నెల రోజుల నుంచి తిరుగుతున్నా ఒక్క అధికారీ దొరకడం లేదు. రైతులను పట్టించుకునేవారే లేరు. ఇప్పటికైనా స్పందించాలి. లేదంటే చార్జీల కోసం నా భార్య తాలిబొట్టును తాకట్టు పెట్టాల్సి వస్తుంది.

- నరసింహులు, హావళిగి

చింతచెట్లు మాయం..!



ఇదే.. ఆ భవనం

శింగనమల మండలం తరిమెల సహకార సంఘం పాత భవనం ఆవరణలోని చింతచెట్లను అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు దర్జాగా అమ్మేశారు. సొసైటీ భవనాన్ని సుమారు 30 సెంట్ల విస్తీర్ణంలోని ప్రభుత్వ భూమిలో నిర్మించారు. ఆవరణలో చింత చెట్లను పెంచారు. భవనం శిథిలం కావడంతో సొసైటీ కార్యాలయాన్ని వేరే చోటుకు మార్చారు. దీంతో అక్కడున్న చింతచెట్లపై వైసీపీ మండల నాయకుడి కన్ను పడింది. మొత్తం 27 చింతచెట్లను రూ.2.50 లక్షలకు అమ్మేశాడని సమాచారం. దీని వెనుక సొసైటీ సిబ్బంది పాత్ర కూడా ఉందని సమాచారం. అందుకే.. ఆలస్యంగా ఈ వ్యవహారం బయటపడింది. వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు పది రోజుల క్రితం ఎన్నిక ప్రచారానికి తరిమెలకు వెళ్లారు. ఆ సమయంలో 'చింతచెట్లు ఏమయ్యాయి..?' అని స్థానికులు నిలదీశారు. అమ్మకున్నది కీలక ప్రజాప్రతినిధి బంధువు కావడంతో మండలంలో ఆయన సమాధానం చెప్పలేకపోయారని సమాచారం. సొసైటీ పాత భవనం వద్ద కోల్డ్ స్టోరేజీ భవనాల నిర్మాణానికి అనుమతులు వచ్చాయని, దీంతో కాంట్రాక్టర్ చింతచెట్లను తొలగించినట్లు తెలిసిందని సొసైటీ కార్యదర్శి సూర్యనారాయణ అన్నారు. వాటిని అమ్మిన సమాచారం తెలియదని అన్నారు. భవన నిర్మాణ పనులు ఇంకా మొదలే కాలేదు. మరి చెట్లను అమ్మిన సొమ్ము ఏమైనట్లు..? అని జనం ప్రశ్నిస్తున్నారు.

- శింగనమల

పరుగో పరుగు

తాడిపత్రి గొడవలు.. పోలీసుల గాలింపు

యాడికి, మే 15: పోలింగ్ సందర్భంగా తాడిపత్రిలో జరిగిన గొడవల నేపథ్యంలో యాడికి మండలవ్యాప్తంగా నాయకుల కోసం బుధవారం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో పలువురు గ్రామాలను వదిలి వెళ్లారు. రాయలచెరువుకు చెందిన తెలుగుయువత మండల అధ్యక్షుడు శోభన్‌బాబు, యాడికిలో వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఆ పార్టీ నాయకుడు బాలా రమేష్‌బాబును పోలీసులు అదుపులోకి తీసుకుని, తాడిపత్రికి తరలించినట్లు తెలిసింది. రాయలచెరువులో టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న నాయకులను అదుపులోకి తీసుకోవడానికి మధ్యాహ్నం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. ముందస్తు సమాచారం అందుకున్న నాయకులు వేరే ప్రాంతాలకు వెళ్లినట్లు సమాచారం. ఎన్నికల్లో ఏజెంట్లుగా కూర్చున్న వారందరినీ పోలీసులు తీసుకువెళతారని స్థానికంగా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. దీంతో ఏజెంట్లు, వారి కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. తాము గొడవల జోలికి వెళ్లలేదని, కాబట్టి పోలీసులు తమను తీసుకువెళ్లరని కొందరు తమను తాము సమాధానపరుచుకుంటున్నారు. అయినా ఎందుకొచ్చిన గొడవ అని రాత్రిళ్లు ఇంటివద్ద ఉండటం లేదు. పోలీసులు తెల్లవారుజామున తనిఖీలకు వస్తారని, ఆ సమయంలో ఇంటివద్ద ఉండకపోతే సరిపోతుందని పలువురు ఏజెంట్లు చర్చించుకుంటున్నారు.

వణుకుతున్న తాడిపత్రి



ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటివద్ద బారికేడ్లు



జేసీపీఆర్ ఇంటి వద్ద నిర్మానుష్యం

- అర్ధరాత్రి పోలీసుల దాడులు
- జేసీపీఆర్, పెద్దారెడ్డి నివాసాల్లో తనిఖీలు
- వైసీపీ, టీడీపీ శ్రేణుల్లో పలువురి అరెస్టు
- భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిన నాయకులు
- జేసీపీఆర్ అనుచరున్ని చితకబాదిన పోలీసులు
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలు

తాడిపత్రి టౌన్, మే 15: తాడిపత్రి పట్టణాన్ని పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వరుసగా రెండురోజులపాటు ఇక్కడ హింసాత్మక ఘటనలు జరిగాయి. పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజున వైసీపీ వర్గీయులు దాడులు కొనసాగించాయి. టీడీపీ వర్గీయులు ప్రతిదాడులకు దిగారు. దీంతో ఓ సీఐ సహా పలువురు గాయపడ్డారు. వాహనాలు ధ్వంసమయ్యాయి. హింసను కట్టడి చేసేందుకు పోలీసులు భారీగా మోహరించారు. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల నుంచి కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బందిని రప్పించారు. పట్టణంలోని ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆ మార్గాలలో వెళ్లే స్థానికులను సైతం పూర్తిగా చెక్‌చేసి పంపుతున్నారు.

బయటివారితోనే సమస్య..

తాడిపత్రిలో ఎప్పుడు గొడవలు జరిగినా సమీపంలోని యల్లనూరు, పుట్లూరు మండలాల నుంచి పెద్దఎత్తున వైసీపీ శ్రేణులు పట్టణానికి చేరుకుంటున్నాయి. పోలింగ్ రోజున కూడా ఆ రెండు మండలాలవారే పట్టణంలో హల్‌చల్ చేశారు. ఓంశాంతినగర్, పాతకోట ప్రాంతాల్లో జరిగిన రాళ్లదాడుల్లో వీరిపాత్ర ఎక్కువగా ఉంది. రెండో రోజు ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటివద్దకు ఏకంగా ట్రాక్టర్లతో రాళ్లను తీసుకువచ్చి దాడికి వినియోగించారు. చిన్న గొడవతో మొదలై.. విధ్వంసానికి దారి తీయడం తాడిపత్రిలో పదే పదే జరుగుతోంది. అయినా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు.

అజ్ఞాతంలోకి..

తాడిపత్రిలో జరిగిన దాడుల్లో పాల్గొన్న రెండు పార్టీల నాయకులు, కార్యకర్తల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు. దీంతో మిగిలినవారు వణికిపోతున్నారు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు కొందరు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇళ్ల వద్ద, బంధువుల ఇళ్ల వద్ద పోలీసులు తనిఖీలు చేసినా దొరకడం లేదు. ఫోన్‌సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు పట్టుకుంటారన్న భయంతో కొందరు తమ సెల్‌ఫోన్‌లను స్విచాఫ్ చేశారు. యల్లనూరు, పుట్లూరు, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల్లో పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చేదాకా పోలీసుల కంటపడకుంటే చాలని పలువురు అజ్ఞాతవాసానికి వెళ్లారు.

జేసీ ప్రభాకర్‌కు అస్వస్థత

తాడిపత్రిలో హింస నేపథ్యంలో పోలీసులు మంగళవారం బాష్ప వాయువును ప్రయోగించారు. దీంతో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, ఆయనకు ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ సోకినట్లు నిర్ధారించారు.

చావబాదిన పోలీసులు

జేసీ ప్రభాకర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్, టీడీపీ మద్దతుదారుడు దాసరి కిరణ్‌ను పోలీసులు చావబాదారు. దివ్యాంగుడని చూడకుండా లాఠీలతో కుల్లపొడిచారు. దీంతో శరీరమంతా రక్తపు గాయాలతో నిండిపోయింది. దుస్తులు రక్తంతో తడిచిముద్దయ్యాయి. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న కిరణ్‌ను స్థానిక సీఐ వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. బాధితుడు అక్కడ తనపై దాడి చేయించిది గతంలో తాడిపత్రిలో పనిచేసిన డీఎస్పీ చైతన్య అని మీడియాకు తెలిపాడు. దివ్యాంగుడిననే కనికరం లేకుండా చావకొట్టారని కన్నీటిపర్యంతమయ్యాడు. తాను ఏం తప్పు చేశానని ప్రశ్నించాడు.

డీఎస్పీ చైతన్య కొట్టించాడు

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నేను కంప్యూటర్ ఆపరేటర్‌గా చాలా ఏళ్లుగా పనిచేస్తున్నాను. దివ్యాంగుడిని. పోలింగ్ రోజున వైసీపీ, టీడీపీ అభ్యర్థులకు గొడవలు జరిగాయి. మరుసటిరోజు మంగళవారం సాయంత్రం కూడా రాళ్లదాడులు జరిగాయి. పోలీసులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. నేను జేసీ క్యాంపు కార్యాలయంలోనే ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి స్పెషల్ పార్టీ పోలీసులు నా వద్దకొచ్చారు. డీఎస్పీ చైతన్య సార్ పిలుస్తున్నారు.. కాలేజీ గ్రౌండ్‌లో ఉన్నారు.. రావాలని అన్నారు. అంతమంది పోలీసులొచ్చేసరికి భయపడి వారి వెంట వెళ్లాను. గ్రౌండ్‌లోకి వెళ్లిన తరువాత డీఎస్పీ చైతన్య సార్ నన్ను చూసి వీన్ని కొట్టండి అని ఏపీఎస్పీ పోలీసులను ఆదేశించాడు. వారు లాఠీలతో ఇష్టారాజ్యంగా కొట్టారు. కొట్టొద్దని కాళ్లావేళ్లా పడినా పట్టించుకోలేదు. పోలీసులు ఎక్కడకొడితే అక్కడ రక్తం చిమ్మడంతో స్పృహ తప్పాను. ఆ తరువాత నన్ను ఎవరు తాడిపత్రి ఆస్పత్రికి తీసుకెళ్లారో... అక్కడి నుంచి అనంతపురానికి ఎవరు తీసుకొచ్చారో తెలియదు.

అర్ధరాత్రి పోలీసుల దాడులు

తాడిపత్రిలో హింస నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు దాడులకు దిగారు. అనంతపురం రేంజ్ డీఐజీ షేముషి, కర్నూలు డీఐజీ విజయరామారావు, అనంతపురం ఎస్పీ అమిత్‌బర్దర్, అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, గతంలో తాడిపత్రిలో పనిచేసి.. ప్రస్తుతం రాయచోటిలో ఉన్న డీఎస్పీ చైతన్య, శింగనమల డీఎస్పీ శివారెడ్డి, కల్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు దాడులలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి నివాసాల్లో తనిఖీలు చేశారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అదుపులోకి తీసుకుని.. ఆయన స్వగ్రామం తిమ్మంపల్లికి తరలించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన తనయుడు, టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని హైదరాబాద్‌కు తరలించారు. వైసీపీ, టీడీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు.



జూనియర్ కళాశాల మైదానంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న అడిషనల్ ఎస్పీ



రక్తపు ముద్దలా దాసరి కిరణ్



చికిత్స పొందుతున్న జేసీపీఆర్

కలిసిరాని సేద్యం

ఇద్దరు రైతుల బలవన్మరణం



చెంగల వెంకటరాముడు (ఫైల్)



ఆర్థికసాయం అందజేస్తున్న రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం, మే 15: జిల్లాలో సేద్యం కలిసిరాక, అప్పుల ఒత్తిడి భరించలేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లి గ్రామంలో రైతు చెంగల వెంకటరాముడు(53) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు ఆరు ఎకరాల పొలం ఉంది. అందులో వేరుశనగ, కంది, మిర్చి తదితర పంటలు సాగు చేసేవాడు. పంట నష్టం రావడం, బోరుబావులు ఎండిపోవడం, కొత్తగా బోర్లు వేసినా నీరు పడకపోవడంతో కోలుకోలేనంతగా దెబ్బతిన్నాడు. సేద్యానికి, కుటుంబ అవసరాలకు తెచ్చిన అప్పులు రూ.20 లక్షలు దాటాయి. వాటిని తీర్చేమార్గంలేక మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మిరప పంటకు మందు పిచికారీ చేయడానికి వెళ్లి.. అక్కడే పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఆయనకు భార్య ఓబులమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతపురం సర్వజన ఆస్పత్రిలో వెంకటరాముడు మృతదేహాన్ని సందర్శించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రైతు కుటుంబానికి ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

- పుట్లూరు మండలకేంద్రానికి చెందిన రైతు వేమన్నగారి రాజశేఖర్‌రెడ్డి (46) అప్పుల బాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. రాజశేఖర్‌రెడ్డికి ఐదెకరాల పొలం ఉంది. అందులో మొక్కజొన్న సాగుచేడు. సాగుకోసం రూ.3 లక్షల మేర అప్పు చేశాడు. రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో భరించలేక ఇంట్లోనే విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య రాజేశ్వరి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాజశేఖర్‌రెడ్డి మృతదేహం

వసతి అడిగితే.. తాళం వేశారు..!


ఎస్కేయూ పరిపాలనా భవనం బయట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, మే 15: పోటీ పరీక్షలకు చదువుకుంటున్న ఎస్కేయూ విద్యార్థులు తమకు హాస్టల్ వసతి కల్పించాలని వర్సిటీ యాజమాన్యాన్ని అభ్యర్థించేందుకు బుధవారం పరిపాలనా భవానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు విద్యార్థులను కట్టడిచేసి పరిపాలనా భవనంలోకి రాకుండా తాళాలు వేశారు. దీంతో బాధిత విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు వేమన, హేమంత్ కుమార్‌లతో కలిసి భవనం బయటే నిరసన వ్యక్తంచేశారు. వేసవి సెలవులు ప్రకటించడంతో హాస్టల్స్‌ను మూసివేశారని, పోటీ పరీక్షలకు చదువుకోవాడానికి సమస్యగా మారిందని వాపోయారు. భోజన సదుపాయం అవసరంలేదని కేవలం వసతిని మాత్రమే కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేసేందుకు వస్తే ఇలా తాళాలు వేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. పోలీసులను పిలిపించి అడ్డుకోవడం హేయమైన చర్య అని మండిపడ్డారు. తాము పోటీ పరీక్షలకు చదువుకునేలా వసతిని కల్పించాలని డిమాండ్‌చేశారు.

ఎస్ఎల్‌ఏపీలో భారీ అగ్ని ప్రమాదం

- పెద్దఎత్తున ఆస్తి నష్టం.. పలువురికి అస్వస్థత


పరిశ్రమలో ఎగసి పడుతున్న మంటలు

పెనుకొండ టౌన్, మే 15: సోమందేపల్లి మండలం గుడిపల్లి పంచాయతీ పరిధిలో ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న ఎస్ఎల్‌ఏపీ పరిశ్రమలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. కియ కార్లకు విడిభాగాలు అందించే అనుబంధ పరిశ్రమలో ఎస్ఎల్‌ఏపీ ఒకటి. ఇక్కడ కార్లకు సంబంధించి ఏసీ, గ్లాసులు తయారు చేస్తారు. పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు నిర్మాణ పనులు చేపట్టారు. దుమ్ము దూళి రాకుండా పట్టలు కప్పారు. సిబ్బంది వెల్డింగ్ పనులు చేస్తుండగా షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫైర్ సేఫ్టీ పరికరాలతో ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. పెనుకొండ, హిందూపురం నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే భారీగా నష్టం జరిగింది. ముడి సరుకులు దగ్ధం కావడంతో రూ.కోట్లలో నష్టం జరిగిందని సమాచారం. పలువురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. సోమందేపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్, ఫైర్ సిబ్బంది ఈ ప్రమాద వివరాలను సేకరిస్తున్నారు. పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటంతో చుట్టుపక్కల ఉన్న పరిశ్రమలవారు భయాందోళనకు గురయ్యారు.


అస్వస్థతకు గురైన కార్మికుడు

హత్యకేసులో ముద్దాయిలకు జీవితఖైదు

ముదిగుబ్బ, మే 15: ఓ హత్యకేసులో ముద్దాయిలకు జీవితఖైదు విధించినట్లు ముదిగుబ్బ సీఐ యతీంద్ర తెలిపారు. ముదిగుబ్బ మండలం ఎస్.బండ్లపల్లి గ్రామానికి చెందిన సాకే గంగరాజు, తలుపుల మండలం సబ్బనగుంతపల్లి గ్రామానికి చెందిన గుజ్జల గంగప్ప భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే అనుమానంతో సాకే గంగరాజును ఎలాగైనా హత్య చేయాలని గంగప్ప, అతని స్నేహితుడు సానేవారిపల్లి గ్రామానికి చెందిన లోమడ ఆంజనేయులు పథకం పన్నారు. వారంతా కలిసి 2016 మార్చి 2న ఉదయం 7:45 గంటల సమయంలో సాకే గంగరాజును మేకలు కొనడానికి ముదిగుబ్బ పాతవూరికి వెళ్దామని నమ్మించారు. ఇద్దరు ద్విచక్ర వాహనంలో కూర్చోబెట్టుకొని, పాతూరు రైల్వేగేటుకు దగ్గరలో ఉన్న మిల్లు వెనుకకు వెళ్లారు. అక్కడికి వెళ్లగానే ఒక్కసారిగా వారి వెంట తెచ్చుకున్న కొడవళ్లతో విచక్షణారహితంగా సాకే గంగరాజు తలపై నరికి చంపి పారిపోయారన్నారు. గంగరాజు అన్న సాకే వెంగముని ఫిర్యాదు చేయగా అప్పటి నల్లమాడ సీఐ శివరాముడు, ఎస్ఐ జయనాయక్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారన్నారు. కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేయగా అనంతపురము నాల్గవ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి విచారించి, వాదనలు ముగిసిన అనంతరం ముద్దాయిలు గుజ్జల గంగప్ప, లోమడ ఆంజనేయులుకు ఒక్కొక్కరికి 5వేలు జరిమానా విధించడంతో పాటు జీవితఖైదు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు. హత్యకేసులో ముద్దాయిలకు శిక్ష పడే విధంగా కేసు దర్యాప్తు చేపట్టిన అప్పటి అధికారులను శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి అభినందించినట్లు తెలిపారు.

భవితను తేల్చేది యువతేనా..?



- వైసీపీ అభ్యర్థుల అంతర్మథనం
- కూటమి పథకాలపై ఆందోళన
- జగన్ నియంతృత్వ పాలనపైనా విసుర్లు
- అధికార పార్టీలో నైరాశ్యం

అనంతపురం, మే 15(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళి అధికార వైసీపీ అభ్యర్థులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. పోలింగ్‌కు ముందురోజు వరకూ మళ్లీ మేమే అధికారంలోకి వస్తామనే ఆశల పల్లకిలో ఆ పార్టీ అభ్యర్థులు ఉన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత గెలుపోటములపై ఆ పార్టీ అభ్యర్థుల్లో అనేక అనుమానాలు నెలకొన్నాయి. ఐదేళ్ల పాలనలో బటన్ నొక్కుడుతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చామని గొప్పలుపోయిన ఆ పార్టీ అభ్యర్థులు.. అభివృద్ధిని మరిచాం కదా అని ఇప్పుడు గుర్తిస్తున్నారు. పింఛన్‌దారులు, మహిళలు తమకే ఓటు వేసుంటారనే నమ్మకంతో ఉన్న వైసీపీ అభ్యర్థులకు యువ ఓటర్ల నిర్ణయంపై గుబులు రేపుతోంది. యువత ఎటువైపు ఉన్నారనే అంతర్మథనంలో వైసీపీ అభ్యర్థులు కొట్టుమిట్టాడుతున్నారు. ఆయా ని యోజకవర్గాల్లో పోలైన ఓట్లల్లో యువత ఓట్ల శాతం ఎంత ఉంటుందనే లెక్క లు వేసుకుంటున్నారు. ఐదేళ్ల పాలనలో యువతకు ప్రత్యేకంగా ప్రయోజనా లు చేకూర్చింది లేదు కదా అనే భావన ఆ పార్టీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో యువత ఓటు ఎటువైపు అనే సందిగ్ధం వారిని వెంటాడుతోం ది. చివరికి గెలుపోటములపై.. ఎలా రాసి పెట్టి ఉంటే అలా జరుగుతుందనే నైరాశ్యంలో ఆ పార్టీ అభ్యర్థులు ఉన్నారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కూటమి యువత పథకాలపై ఆందోళన

సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా... యువతకు ఏడాదికి 4 లక్షలు చొప్పున ఐదేళ్లకు 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కూటమి మేనిఫెస్టోలో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు... యువతకు ఉద్యోగం వచ్చేంత వరకూ నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి అందజేస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో ప్రతి సభలోనూ స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయిన తరువాత విభజిత రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన తరువాత కరువు జిల్లాలో కియా పరిశ్రమ తీసుకొచ్చి వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన విషయం తెలిసిందే. మరీ ముఖ్యంగా కూటమి అధికారంలోకి రాగానే... మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తానని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇవ్వడంతో యువతలో ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలోనే... బెంగళూరు, హైదరాబాదు, చెన్నై నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న యువత పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొనడం వైసీపీ అభ్యర్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. తమ గెలుపోటములపై యువత ప్రభావం తప్పనిసరిగా పడుతుందన్న అభద్రతాభావం వైసీపీ అభ్యర్థులను వెంటాడుతోంది.

అధినేత నియంతృత్వ పాలనపైనా విసుర్లు

రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా... ఆయనకంటే మెరుగైన పాలన అందిస్తానని ఒక్క చాన్స్ ఇవ్వాలని వైఎస్ జగన్ పాదయాత్రలోనూ, గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలోనూ ప్రజలను అభ్యర్థించారు. అన్ని వర్గాల ప్రజలు జగన్ మాటలు నమ్మి తిరుగులేని మెజార్టీతో అధికారాన్ని కట్టబెట్టారు. ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమపాళ్లల్లో చూడాల్సిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి నియంతృత్వ పాలన సాగించాడని పోలింగ్ తరువాత ఆ పార్టీ అభ్యర్థుల్లో విసుర్లు మొదలయ్యాయి. ఎన్టీ రామారావు కాలం నుంచే పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ఆ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయనుకుంటే పొరబడినట్లేనన్న భావన ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మేనిఫెస్టో రూపకల్పనలోనూ కూటమి మేనిఫెస్టోతో పోలిస్తే... వైసీపీ మేనిఫెస్టో ప్రజల్లో భరోసా నింపలేదన్న వాదన ఆ పార్టీలో లేకపోలేదు. సంక్షేమ పథకాల ద్వారా ఫలానా ఇంటికి ఇంతమొత్తంలో లబ్ధి చేకూర్చామని ఇంటింటికి వెళ్లి చెబుతున్నామే గానీ.. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు పరిశ్రమలు తీసుకొచ్చారా..? ఒక్క ఉద్యోగం అయినా ఇచ్చారా..? ప్రాజెక్టులు పూర్తీచేసి ఒక ఎకరాకైనా సాగు నీరిచ్చారా..? అనే ప్రశ్నలకు ఆ పార్టీ అభ్యర్థులు సమాధానం ఇచ్చుకోలేని పరిస్థితిని ఎదుర్కొన్నామన్న ఆవేదన వారిలో ఉంది. ఈ పరిణామాలే తమను దెబ్బ తీస్తాయని ఆ పార్టీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

యువత ఓటు శాతంపై గుబులు

యువత ఓటు శాతం పెరగడంపై అధికార వైసీపీ అభ్యర్థుల్లో అలజడి రేపుతోంది. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువ ఓటర్లు అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏ పోలింగ్ కేంద్రంలో చూసినా... ఉదయం 7 గంటలకు ముందే యువత ఓటు వేసేందుకు బారులు తీరిన విషయం తెలిసిందే. ఇదే అధికార వైసీపీ అభ్యర్థుల్లో గుబులు రాజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 20.18 లక్షల మంది ఓటర్లుండగా... అందులో 18 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయస్సు యువ ఓటర్లు 49,234 మంది ఉన్నారు. 20 నుంచి 29 ఏళ్లలోపు యువకులు 3,72,769 మంది ఉన్నారు. 30 నుంచి 39 ఏళ్లలోపు యువకులు 5,84,111 మంది ఉన్నారు. అంటే మొత్తంగా యువ ఓటర్లు 10,06,114 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే జిల్లా ఓటర్లల్లో 50 శాతం మంది యువ ఓటర్లు ఉన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున పోలింగ్ నమోదు కావడంతో... యువ ఓటర్లు దాదాపు 37 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పోలింగ్ విధులకు హాజరైన ఉద్యోగ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఈ యువ ఓటింగ్ శాతమే వైసీపీ అభ్యర్థుల్లో గుబులు రాజేస్తోంది. ప్రతి నియోజకవర్గంలోనూ 25 వేల నుంచి 35 వేల మందికిపైగానే యువ ఓటర్లు ఉండటం వైసీపీ అభ్యర్థులకు కంటకంగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

రక్షించాల్సిన పోలీసులే దాడులు చేస్తారా..?

- డీఎస్పీ చైతన్య ఆదేశాలతోనే కార్యకర్తలపై దాడి
- టీడీపీ శ్రేణులపై ఏకపక్ష చర్యలు
- ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి
- కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, మే 15: ప్రజలను రక్షించాల్సిన పోలీసులే శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా టీడీపీ శ్రేణులపై దాడులు చేయడం సరికాదని కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న దాసరి కిరణ్, వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన పుట్లూరు మండలానికి చెందిన లోకనాథ్ చౌదరి, రామ్మోహన్‌లను బుధవారం ఆయన పరామర్శించారు. దాడులు జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న దాసరి కిరణ్‌ను మంగళవారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు ఇంటి నుంచి బలవంతంగా డీఎస్పీ చైతన్య వద్దకు తీసుకువెళ్లారన్నారు. డీఎస్పీ ఆదేశాలతో పోలీసులు దాసరి కిరణ్‌పై విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. పోలింగ్ రోజు టీడీపీ తరఫున ఏజెంట్లుగా కూర్చున్న టీడీపీ నాయకులను టార్గెట్ చేసుకొని డీఎస్పీ ఏకపక్షంగా వ్యవహరిస్తూ భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకుడు సూర్యముని, టీడీపీ శ్రేణులపై దాడులకు పాల్పడిన వైసీపీ గూండాలను వదిలేసి దాడులకు ఎలాంటి సంబంధం లేని వారిపై పోలీసులు అక్రమ అరెస్టులు చేసేందుకు కుట్రలు చేయడం దారుణమన్నారు. ఓటమిని అంగీకరించలేకనే టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ గూండాలు దాడులకు తెగబడుతున్నారు. ఎన్నికల కమిషన్ ఈ ఘటనలపై స్పందించి, ఏకపక్షంగా వ్యవహరిస్తున్న డీఎస్పీ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడిన దాసరి కిరణ్‌ను పరామర్శిస్తున్న అంబికా లక్ష్మీనారాయణ

ఓటమి భయంతోనే దాడులు

హిందూపురం: ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసే వైసీపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్ప అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడతూ.... తాడిపత్రితో పాటు మాచర్ల, తిరుపతి తదితర ప్రాంతాల్లో పోలింగ్ ముగిసినా వైసీపీ నాయకులు దాడులు చేస్తున్నారంటే వారిలో ఓటమి భయం పట్టుకుందన్నారు. ముఖ్యంగా తాడిపత్రిలో వైసీపీ ఆగడాలు శ్రుతిమించాయన్నారు. వైసీపీ గూండాలపై పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తమిళనాడువాసి హత్య

హిందూపురం, మే 15: తమిళనాడు రాష్ట్రంలోని సేలంకు చెందిన సెల్వకుమార్(54) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లతో మోది హత్య చేశారు. హిందూపురం సమీపంలోని మోతకపల్లి వద్ద మంగళవారం రాత్రి ఈ హత్య జరిగిందని వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. సేలంకు చెందిన సెల్వకుమార్ సోదరులు కర్ణాటక రాష్ట్రంలోని దొడ్డబళ్లాపురంలో ఉంటున్నారు. సెల్వకుమార్‌కు మతిస్థిమితం లేదు. దీంతో పరిగి మండలం మోదా సమీపంలోని ఓ ఆశ్రమంలో చేర్పించారు. అతను హిందూపురానికి మంగళవారం వ చ్చాడు. మోతుకపల్లి సమీపంలో హత్యకు గురయ్యాడు. ఆ దారిలో బుధవారం ఉదయం వెళ్లేవారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి, ఆధారాలు సేకరించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సెల్వకుమార్ సోదరుడు సంఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని గుర్తించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

34 మందిపై కేసు నమోదు

యాడికి, మే 15: పోలింగ్ రోజున జరిగిన గొడవల నేపథ్యంలో మండల పరిధిలోని కోనుప్పలపాడుకు చెందిన వైసీపీ, టీడీపీకి చెందిన 34 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 13న టీడీపీ వైసీపీ వర్గీయులు గ్రామంలో రాళ్లు రువ్వుకున్నారు. ఇరువర్గాలకు చెందిన పలువురు గాయపడ్డారు. టీడీపీకి చెందిన రామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది మంది వైసీపీ వర్గీయులపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో బాలగంగయ్య, గంగిరెడ్డి, బాలగంగన్న తదితరులు ఉన్నారు. వైసీపీ నాయకుడు బాలగంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు 26 మంది టీడీపీ వారిపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో చవ్వా గోపాల్‌రెడ్డి, రామాంజనేయులు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

తినేశారా..?

- బీఎల్‌ఓలకు డబ్బు ఎగ్గొట్టిన అధికారులు



గుంతకల్లు, మే 15: పట్టణంలోని బీఎల్‌ఓ(బూత్ లెవెల్ అధికారులు)లకు ఖర్చుల కింద ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా ఎన్నికల అధికారులు శఠగోపం పెట్టారు. పోలింగ్ రోజు ఖర్చుల కోసం నియోజకవర్గంలోని 276 పోలింగ్ బూత్ సిబ్బందికి టీ, బిస్కెట్స్, స్నాక్స్ కోసం బీఎల్‌ఓలకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి ఇవ్వాల్సి ఉంది. గత వారంలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమం చివరి రోజున ఈ డబ్బు బీఎల్‌ఓలకు ఇవ్వాల్సి ఉంది. అయితే గుంతకల్లు మండలం, గుత్తి, పామిడి మండలాల బీఎల్వోల నుంచి ఓచరు సిగ్నేచరు తీసుకుని సంబంధిత డబ్బును అందజేశారు. కానీ గుంతకల్లు అర్బన్ ఏరియాకు సంబంధించి 106 మంది బీఎల్వోల నుంచి ముందుగానే ఓచరు సంతకాలు తీసుకుని, మీటింగ్ తర్వాత డబ్బివ్వకుండా పంపివేశారు. కొందరు బీఎల్వోలు ఎన్నికల అధికారులను రూ. వెయ్యికి సంబంధించి ప్రశ్నించగా, మొదట మీరు ఖర్చు చేయండి, ఆ తర్వాత బిల్లు దాఖలు చేయండి, డబ్బులిస్తామంటూ మాటదాటవేశారని తెలిసింది. ఈ మేరకు దాదాపు బీఎల్వోలకు పంపిణీ చేయాల్సిన డబ్బు రూ. లక్ష మేరకు ఇవ్వకుండా చుక్కలు చూపుతున్నారు. గుంతకల్లులో ఎన్నికల సిబ్బందికి మున్సిపల్ అధికారులు అధ్వానమైన భోజనాన్ని అందజేశారని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ పోలింగ్ సిబ్బంది పేర్కొన్నారు. ఆ అన్నాన్ని తింటే ఎన్నికల వేళ కడుపునొప్పి వచ్చి ఎక్కడ పోలింగ్ కార్యక్రమానికి అంతరాయం ఏర్పడుతుందోనన్న భయంతో భోజనం తినకుండా కేవలం అరటిపండుతో సరిపుచ్చుకోవాల్సి వచ్చిందని ఆ వ్యక్తి బాధను వెల్లబోసుకున్నారు.

ట్రిపుల్ ఐటీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు, మే 15: రాష్ట్రంలో పదో తరగతి పాసైన విద్యార్థులు ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలులో ఉన్న ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6న నోటిఫికేషన్ వెలువడిందని, బీటెక్ ఆరేళ్ల సమీకృత ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఒక్కో కాలేజీలో 1000 సీట్లు ఉంటాయన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో మరో 100 సీట్లు ఉంటాయని, ఈ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులను ఈనెల 8 నుంచి జూలై 25వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ప్రవేశాల్లో ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 6శాతం, బీసీ-ఏకు 7శాతం, బీసీ-బీకి 10శాతం, బీసీ-సీకి 1శాతం, బీసీ-డీకి 7శాతం, బీసీ-ఈకి 4శాతం చొప్పున రిజర్వేషన్లు ఉంటాయన్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా 5శాతం, సైనిక ఉద్యోగ పిల్లలకు 2 శాతం, ఎన్‌సీసీ విద్యార్థులకు 1 శాతం, స్పోర్ట్స్ కోటా కింద 0.5 శాతం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 0.5శాతం సీట్లు భర్తీ చేస్తారన్నారు. ప్రతి కేటగిరిలోనూ 33.33 శాతం సీట్లు సమాంతరంగా బాలికలకు కేటాయిస్తారన్నారు.

మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఇలా..: పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ పద్ధతిలో ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు కల్పిస్తారు. నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, మున్సిపల్ హైస్కూల్‌లో చదివిన విద్యార్థులకు వచ్చిన మార్కులకు 4 శాతం, డిప్రవేషన్ స్కోరును అదనంగా కలుపుతారని దీనిని సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన విద్యార్థులకు ఇచ్చే వేయిటేజీ మార్కులన్నారు. 85శాతం సీట్లను స్థానికంగానే మిగిలిన 15 శాతం సీట్లను మెరిట్ కోటాలో తెలుగురాష్ట్రాల్లోని విద్యార్థులకు కేటాయిస్తారు. విద్యార్థులు తొలిప్రయత్నంలోనే 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలలో రెగ్యులర్ విద్యార్థులుగా ఉత్తీర్ణులైనవారు అర్హులు. వయస్సు 31-12-2024 నాటికి 18 ఏళ్లు నిండకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరి అభ్యర్థులకైతే 21 ఏళ్లు నిండకుండా ఉన్నవారు అర్హులు.

ఎస్కేయూ ప్రొఫెసర్‌కు రాష్ట్రస్థాయి బహుమతి


జీవీ రమణ

అనంతపురం సెంట్రల్, మే 15: ఎస్కేయూ సామాజిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్, కవి, రచయిత, మోటివేషనల్ స్పీకర్ జీవీ రమణ రచించిన కవితలకు ఉమ్మడి రాష్ట్ర స్థాయి బహుమతి లభించింది. సాయుధ తెలంగాణ పోరాట యోధులు కర్కముత్తారెడ్డి స్మారకార్థం వసుంధర విజ్ఞాన మండలి మార్చిలో ఉమ్మడి రాష్ట్రస్థాయి కవితల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రమణ రచించిన 'మత సామరస్యం-మన భారత దేశం' అనే కవిత ఉత్తమ బహుమతికి ఎంపికైంది. హైదరాబద్‌లో త్వరలో నిర్వహించే వసుంధర విజ్ఞాన మండలి 31వ వార్షికోత్సవాల్లో ఈ బహుమతిని అందుకోనున్నట్లు రమణ తెలిపారు.

మీరా.. మేమా..!

జడ్పీలో సభ్యులు.. అధికారుల మధ్య కోల్డ్‌వార్


జడ్పీ కార్యాలయం



సమావేశాల నిర్వహణ పట్టని ఉన్నతాధికారులు
90 రోజుల గడువు ముగిసినా స్పందన కరువు
జడ్పీ చైర్‌పర్సన్ క్యాంప్ క్లర్కుల ఉపసంహరణ
సమావేశంపై చైర్‌పర్సన్‌తో చర్చించని సీఈఓ, డిప్యూటీ
ప్రజా సమస్యలకంటే పట్టింపులు.. పంతాలే ముఖ్యమా..?
అధికారులు, పాలకవర్గం తీరుపై సర్వత్రా విమర్శలు


జడ్పీ చైర్‌పర్సన్ సీసీలను వెనక్కు రప్పిస్తూ...ఇచ్చిన ఉత్తర్వుల కాపీ

అనంతపురం విద్య, మే 15: ప్రజలు ఎటుపోతే మనకేంటి..? సమావేశాలు మనకెందుకు..? ప్రజా సమస్యలపై చర్చలు ఎందుకు..? ఇదీ.. ఉమ్మడి జిల్లా పరిషత్ తీరు. ఉన్నతాధికారులు, పాలకవర్గ సభ్యులు పంతానికి పోతున్నారు. ఆ రెండు వర్గాల మధ్య కోల్డ్ వార్ తారస్థాయికి చేరింది. అధికారులు పాలకవర్గాన్ని దిక్కరిస్తున్నారంటూ గతంలో జడ్పీటీలు రోడ్డుపైకి వచ్చారు. సమావేశాలను బహిష్కరించారు. డిప్యూటీ సీఈఓను సరెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదే గొడవ చాప కింద నీరులా సాగుతూనే ఉంది. జడ్పీలో సమావేశాల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. 'మాకు ఇష్టమైతే నిర్వహిస్తాం.. లేదంటే లేదు..' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి 90 రోజుల వ్యవధిలో జడ్పీ సర్వసభ్య సమావేశాలను నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఈ నిబంధలను అధికారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. జనవరి 17న జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆ తరువాత 90 రోజుల్లో నిర్వహించాల్సి ఉన్నా కుంటి సాకులతో కాలయాపన చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 90 రోజులు కాదని, 90 పని దినాలు (వర్కింగ్ డేస్) అని అధికారులు కొత్త భాష్యం చెప్పుకుంటున్నారు. వారు చెప్పిన ఆ గడువు కూడా ఈ నెల 9వ తేదీ ముగిసింది. ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. సమావేశం నిర్వహించాలనే అంశంపై కూడా పెద్ద రాద్ధాంతం జరుగుతోందని సమాచారం. జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ పాలకవర్గాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

ఇదీ తీరు..

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించినది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలకు సంబంధించిన అనేక సమస్యలపై, అంశాలపై చర్చించాల్సి ఉంటుంది. పాలకవర్గ సభ్యులు, అధికారులు ప్రజా సమస్యలకు పరిష్కారాలను అన్వేషించాల్సి ఉంటుంది. అందుకే సమావేశం అత్యంత కీలకమైనది. అయితే సమావేశం నిర్వహణ చుట్టూ వివాదం నడుస్తోంది. జనవరి 17వ తేదీ సమావేశం నిర్వహించారు. నిబంధనల మేరకు తొంభై రోజులు సమీపించగానే అధికారులు పాలకవర్గంతో చర్చించి, సమావేశం పెట్టాలి. పాత పద్ధతి ప్రకారం ఏప్రిల్ 17, అధికారుల లెక్క ప్రకారం ఈ నెల 9న.. ఏదో ఒక తేదీలోగా సమావేశం నిర్వహించాలి. కానీ పట్టించుకోలేదు. ఈ నెల 9వ తేదీకి ముందు జడ్పీ అధికారులు సర్వసభ్య సమావేశం నిర్వహణ తేదీపై జడ్పీ చైర్‌పర్సన్ గిజమ్మకు నోట్ పట్టారని సమాచారం. దీంతో ఆమె దీనిపై చర్చించేందుకు సీఈఓ రావాలని ఫైల్‌పై డిస్కస్ అని రాసినట్లు తెలుస్తోంది. అయితే సీఈఓ చైర్‌పర్సన్ వద్దకు వెళ్లలేదని సమాచారం. సీఈఓ అందుబాటులో లేకుంటే.. డిప్యూటీ సీఈఓ వెళ్లాలి. అయితే డిప్యూటీ సీఈఓ కూడా వెళ్లలేదని సమాచారం.

ముగ్గురు సీసీలు వెనక్కు..

సర్వసభ్య సమావేశం గురించి చర్చించడానికి చైర్ పర్సన్ వద్దకు జడ్పీ ఉన్నతాధికారులు వెళ్లకపోగా, కింది స్థాయి సిబ్బందిని బలితీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. జడ్పీ చైర్‌పర్సన్‌ను సమావేశానికి ఎందుకు ఒప్పించలేదని ముగ్గురు క్యాంప్ క్లర్కులపై(సీసీ) సీఈఓ, డిప్యూటీ సీఈఓ ఫైర్ అయ్యారని సమాచారం. చైర్‌పర్సన్ క్యాంపు ఆఫీస్‌లో సీసీలుగా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారులు.. సురేష్‌కుమార్, నరేష్ కుమార్, అనిల్ కుమార్ (సెలవులో ఉన్నారు) సర్వీస్‌ను విత్‌డ్రా చేశారు. ఈ మేరకు సీఈఓ ఈ నెల 8వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ నెపంతో వాళ్లను క్యాంపు ఆఫీస్ నుంచి వెనక్కు తీసుకున్నారు. కానీ అధికారులు, పాలకవర్గం మధ్య కోల్డ్‌వార్ కారణంగానే వారిని వెనక్కు తీసుకున్నట్లు జడ్పీలో చర్చ సాగుతోంది. ఎన్నికల కోడ్ కారణంగానే సీసీలను వెనక్కు రప్పించాలని అనుకుని ఉంటే.. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రప్పించేవారని, కానీ ఉన్నఫలంగా ఇప్పుడు రప్పించడం ఏమటని ప్రశ్నిస్తున్నారు.



చట్టానికి తూట్లు..

పంచాయతీరాజ్ చట్టం మేరకు ప్రతి 90 రోజులకు ఒకసారి జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించాలి. ఒక సమావేశం నిర్వహించిన తర్వాత తొంభై రోజుల గడువు ముగిసే లోగా మళ్లీ నిర్వహించాలి. పంచాయతీరాజ్ చట్టం ఇదే చెబుతోంది. అయితే జడ్పీలో అధికారులు దీన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్పష్టమవుతోంది. గతంలో కూడా పంచాయతీరాజ్ చట్టం మేరకు 90 రోజుల్లో నిర్వహించాల్సిన సమావేశాన్ని 136 రోజులు దాటినా నిర్వహించలేదని జడ్పీటీసీలు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా అధికారుల తీరు మారడం లేదు. తాజాగా మరోసారి పంతాలకుపోయి సమావేశాలను గాలికి వదిలేశారు. గతంలో ఉన్న కలెక్టర్ ఈ సమస్యను పట్టించుకోలేదు. పైగా అధికారులు వర్సెస్ పాలకవర్గం మధ్య ఉన్న కోల్డ్ వార్‌కు ఆజ్యం పోశారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన పాలకవర్గం సభ్యులు, అధికారులు పంతాలకు, పట్టింపులకు వెళ్లడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కొత్త కలెక్టర్ ఈ సమస్యకు చెక్ పడుతారో లేదో వేచి చూడాల్సిందే.



నిర్లక్ష్యానికి ఐదేళ్లు

- నిరుపయోగంగా ఎస్సీ స్టడీ సర్కిల్
- రూ. 1.50 కోట్లతో నిర్మించిన టీడీపీ ప్రభుత్వం
- వినియోగంలోకి తీసుకురాని వైసీపీ ప్రభుత్వం
- నీరుగారిన లక్ష్యం.. నష్టపోయిన ఎస్సీ విద్యార్థులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 15: జిల్లాలో ఎస్సీ విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు.. గ్రూప్- 1,2,3,4, సివిల్స్ తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమ య్యేందుకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి... అందులోనే రెసిడెన్షియల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.. అని పలు కుల, విద్యార్థి సంఘాలు పోరాటాలు చేశాయి. ఫలితంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో అంబేడ్కర్ భవన్ స్టడీ సర్కిల్‌కు పునాదులు పడ్డాయి. అనుకున్న మేరకు టీడీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసి భవనాన్ని నిర్మించింది. రూ. 1.50 కోట్లతో ఆ భవనాన్ని నిర్మించి 2018లో ప్రారంభించింది. వాటికి కావాల్సిన అన్ని వసతులు, గదులు ఏర్పాటు చేశారు. దీనికి తోడు విద్యార్థుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆ స్టడీ సర్కిల్‌ను రెసిడెన్షియల్ స్టడీ సర్కిల్‌గా మార్పు చేసింది. అందులోనే విద్యార్థులకు శిక్షణతో పాటు భోజనం, వసతిని ఏర్పాటు చేసింది. దీంతో ఎస్సీ విద్యార్థులు, పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అన్ని వసతులు నిర్మాణమైన అంబేడ్కర్ భవన్ స్టడీ సర్కిల్‌ను వినియోగంలోకి తీసుకురావడమే వైసీపీ ప్రభుత్వం ముందున్న లక్ష్యం. కేవలం టీడీపీ హయాంలో నిర్మించింది... వినియో గంలోకి తెస్తే టీడీపీకి పేరొస్తుందన్న ఒకే ఒక్క దురుద్దేశంతో ఆ స్టడీ సర్కిల్‌ను నిర్వీర్యపరిచి వేలాది మందిఎస్సీ విద్యార్థుల ఆశలు చిదిమేసింది. దీంతో జిల్లాలోని ఎంతో మంది నిరుపేద ఎస్సీ విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందని ద్రాక్షగా మారింది. ఫలితంగా ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తూ వేలకువేలు ఫీజులు కట్టి మరీ శిక్షణ పొందుతున్నట్లు పలువురు విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.



శ్రీనగర్ కాలనీలో నిర్మించిన అంబేడ్కర్ భవన్, స్టడీ సర్కిల్

ప్రధాన రహదారిపై భారీ గుంతలు

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

చెన్నేకొత్తపల్లి, మే 15: ధర్మవరం నుంచి ఎన్ఎస్ గేటుకు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై అక్కడక్కడ పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని నాగసముద్రం క్రాస్ చందమూరు, ప్యాదిండి గ్రామాల సమీపంలో ప్రధాన రహదారిపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు వెంట అనునిత్యం పెద్దఎత్తున రాకపోకలు సాగుతుండటంతో చాలా మంది ప్రమాదాలకు గురవుతుండటంతో పాటు మృత్యువాత కూడా పడ్డారు. ఇటీవల నాగసముద్రం క్రాస్ వద్ద ఏర్పడిన గుంత వద్ద ప్రమాదానికి గురై సీకేపల్లికి చెందిన హాస్టల్ వార్డెన్ మృతిచెందాడు. అదే విధంగా చందమూరు వద్ద ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి అనేక మంది గాయపడ్డారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రోడ్డుపై గుంతలతో ఎక్కువ ప్రమాదాలు జరిగాయి. వాహనాలు అదుపు తప్పి రోడ్డుపక్కకు బోల్తాపడిన సంఘటనలున్నాయి. ప్రజలు మృత్యువాత పడుతున్నా... ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న పాపానపోలేదని ప్రజలు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



చందమూరు గ్రామం వద్ద నడిరోడ్డుపై భారీ గుంత



నాగసముద్రం క్రాస్ సమీపంలో ఏర్పడిన గుంత



ప్యాదిండిలో రోడ్డుపై ఏర్పడిన గుంత

పోలింగ్ సరళిపై పరిటాల సునీత సమీక్ష



రాప్తాడు నియోజకవర్గ నాయకులతో సమావేశమైన పరిటాల సునీత

అనంతపురం అర్బన్, మే 15: రాప్తాడు నియోజకవర్గంలో పోలింగ్ సరళిపై రాప్తాడు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులతో పరిటాల సునీత సమీక్ష నిర్వహించారు. బుధవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశాన్ని చేపట్టారు. ఎన్నికలు ఎలా జరిగాయి... ఈసారి ఎంత మెజారిటీ వస్తుంది.. ఏఏ మండలాల్లో ఎన్ని ఓట్లు తమకు అనుకూలంగా పడ్డాయి.. గ్రామాల్లో ఏమైనా సమస్యలు వచ్చాయి.. తదితర అంశాలను ఆరా తీశారు. కొన్ని చోట్ల వైసీపీ నాయకుల నుంచి ఎదురైన ఇబ్బందులను నాయకులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతి గ్రామంలోనూ ఖచ్చితంగా టీడీపీకే మెజార్టీ వస్తుందని నాయకులే ధీమా వ్యక్తం చేశారు. సునీత మాట్లాడుతూ... ఖచ్చితంగా ఈసారి ఎన్నికల్లో తామే గెలవబోతున్నామని, ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఇచ్చిన హామీలు కచ్చితంగా నేరవేస్తామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలని, ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, ఆ తర్వాత అంత కలిసిమెలసి ఉండాలని సూచించారు. గ్రామాల్లో రెచ్చగొట్టే వారు ఉంటారని, అలాంటి వారి మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని హితవుపలికారు.

దాడి చేశారని దంపతుల ఫిర్యాదు

అనంతపురం క్రైం, మే 15: అనంతపురం రూరల్ మండలం కురుకుంటకు చెందిన మహేష్ నాయక్, నాగేంద్ర నాయక్ తమపై దాడి చేశారని నగరానికి చెందిన ఆకాష్, షాకిష దంపతులు బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు కురుకుంటకులో సర్వేనెంబర్ 129-2బీలో 5.20 ఎకరాల భూమి ఉందని, దాన్ని కొందరు కబ్జా చేశారని, ఈ విషయమై కొన్నేళ్లుగా తాము తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని అన్నారు. తమకు న్యాయం చేయాలని మహేష్‌నాయక్, నాగేంద్ర నాయక్‌ను ఆరు నెలల క్రితం ఆశ్రయించామని, తమ నుంచి వారు రూ.5 లక్షలు తీసుకున్నారని, అయితే ఇంతవరకు తమకు న్యాయం దక్కలేదని అన్నారు. దీన్ని ప్రశ్నించినందుకు వారు తమపై బుధవారం దాడి చేయించడంతో తాము ఆస్పత్రి పాలయ్యామని వాపోయారు. చికిత్స అనంతరం తాము దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు. కాగా, తనపైనా వారు దాడి చేశారని నాగేంద్ర నాయక్ అదే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశారు.



మాట్లాడుతున్న దంపతులు

ప్రధాన రోడ్లపై మురుగునీరు

- ఆత్మకూరులో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ ● చిన్నపాటి వర్షానికే బురదమయం



ఆత్మకూరులో మెయిన్ రోడ్డుపై నిలిచిన వర్షపు, మురుగు నీరు

ఆత్మకూరు : ఆత్మకూరులో డ్రైనేజీల నిర్వహణ సరిగా లేకపోవడంతో మురుగునీరు వీధుల్లోనే ప్రవహిస్తోంది. భరించలేని దుర్వాసన వస్తుండటంతో పాటు దోమలకు నిలమయ్యై.. ప్రజలు రోగాల బారిన పడేందుకు కారణం అవుతోంది. పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే వీధులన్నీ బురదమయం అవుతున్నాయి. ఆర్టీసీ బస్టాండులో వర్షపునీరు నిల్వ ఉంటోంది. ఆర్డీటీ స్టేడియం ఎదుట కూడా ఇదే పరిస్థితి. అంకాలమ్మ వీధి నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో రోడ్డుపై మురుగునీరు పారుతోంది. స్థానికులు నడవలేని పరిస్థితి ఉంది. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేదని ఆ కాలనీవాసులు మండి పడుతున్నారు. కురుబ వీధి, పడమటి వీధిలో మురికి నీరు నిల్వ ఉంటోంది. దోమలతో చిన్న పిల్లలు తరుచూ జ్వరాలు బారిన పడుతున్నారు.

ఆదాయం ఉన్నా...

మేజర్ పంచాయతీలో రూ. లక్షలు ఆదాయం ఉన్నా.. ఆ మొత్తాన్ని దేనికి ఖర్చు పెడుతున్నారో అర్థం కాని ఉంది. ప్రతి ఇంటికి నీటి పన్ను.. చెత్త పన్ను.. లైబ్రరి పన్ను తదితర పన్నులతో ఏడాదికి రూ. 40 లక్షలుకు పైగా పంచాయతీ సిబ్బంది వసూలు చేస్తున్నారు. వాటితో పాటు భవనాలు నిర్మాణాలు అనుమతులకు వేల రూపాయలు పన్నుల రూపంలో వసూలు చేస్తున్నారు. ఇంత ఆదాయం వస్తున్నా... పంచాయతీ అధికారులు కనీసం డ్రైనేజీ సమస్య పరిష్కరించలేదని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. గ్రామంలో అడిగేవారు లేక... పంచాయతీలో ఏకపక్షంగా బిల్లు ఆమోదం తెలుపుతూ నిధులు డ్రా చేస్తున్నారనే విమర్శలున్నాయి.





ఆర్టీసీ బస్టాండులో నిల్వ ఉన్న మురుగు నీరు, పడమటి వీధి దుస్థితి

రైతులకు పంటనష్టపరిహారం చెల్లించాలి

అనంతపురం విద్య, మే 15 : పంట నష్టపరిహారం వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ఏడాది తీవ్ర కరువు వల్ల పంటలు పండక, పెట్టుబడులు చేతికి అందక రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. ఈ ఏడాది పెట్టుబడులు పెట్టలేని దుస్థితిలో అనంత రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇదివరకే పంట నష్టపరిహారం అందజేస్తున్నట్టు ఈనెల 7న రైతుల ఖాతాల్లో జమ చేయడం కోసం బటన్ నొక్కి కార్యక్రమం పూర్తి చేసిందన్నారు. అయితే ఇప్పటికీ రైతులు ఖాతాల్లోకి డబ్బులు జమ కాలేదన్నారు. రైతుల వద్ద డబ్బులు లేక...పంటల సాగు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు వేయాలని కోరారు.

శింగనమల ఫలితాలపైనే అందరి దృష్టి

బుక్కరాయసముద్రం, మే 15 : ఉమ్మడి జిల్లాలో జరిగిన సార్వత్రి ఎన్నికలలో .. 14 నియోజకవర్గాల్లో శింగనమల నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుస్తోందా అని ప్రతి ఒక్కరు ఆరా తీస్తున్నారు. కూటమి. వైసీపీ మధ్య గెలుపు ఓటమిలపై ఉత్కంఠ రేపుతోంది. గతంలో జరిగిన తొమ్మిది సార్వత్రిక ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుపొందుతారో... ఆ పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి రావడం జరిగింది. దీంతో ఈ నియోజకవర్గం ఎన్నికల ఫలితాలపైన జిల్లాలోనే కాకుండా, ఇతర జిల్లాల వాసుల ఆసక్తి పెరుగుతోంది. శింగనమల గెలుపు ఏ పార్టీ అని... స్థానికంగా ఉన్న నేతలకు అన్ని రాజకీయ పార్టీ నేతలు ఫోన్‌లు ద్వారా సమాచారం అడిగి తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో కూడా ఈ సారి సెంటిమెంట్ ఫలించేనా... అని రాజకీయ నేతలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే టీడీపీ - వైసీపీ రాజకీయ నేతలు కేంద్రాల వారిగా పోలైన ఓట్లు, పార్టీల వారిగా లెక్కలు వేసుకుని సమీకరణాలు చేసుకునే పనిలో నిమగ్నం అయ్యారు. పోలింగ్ సరళిని చూసి ఆయా గ్రామాల నేతలతో మాట్లాడి గ్రామాల వారిగా ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయని లెక్కకడుతున్నారు. గెలుపు ఓటమిలపై ఎవరి ధీమా వారిదే అన్న రీతిలో ఉన్నారు.

టీడీపీదే గెలుపు..

శింగనమల మే 15: శింగనమల నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఓటర్లు టీడీపీ వైపు మొగ్గు చూపారని, ఆ పార్టీనే గెలిచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఈ సారి యువకులు, మహిళలు ఎక్కువగా ఓటేశారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సొంతూళ్లకు చేరుకుని మరీ ఓటు వేశారు. 2019 ఎన్నికలల్లో వైసీపీ పడ్డ ఓట్లు ఈ సారి.. తిరిగబడినట్లు సమాచారం. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీకి అనుకూల ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో టీడీపీ భారీ మెజార్టీ, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో వైసీపీ స్వల్ప మెజార్టీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

విధులకు ఉద్యోగులు.. పోలింగ్‌పై చర్చ

అనంతపురంరూరల్, మే 15: సాధారణ ఎన్నికల ఫలితాలపై ఏ కార్యాలయంలో చూసినా ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. సోమవారం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఎన్నికల విధులకు వెళ్లిన ఉద్యోగులు, సిబ్బంది బుధవారం తమ విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో వారు జరిగిన ఎన్నికల పోలింగ్‌పై మాట్లాడుకోవడం కనిపించింది. చాలా వరకు వన్‌సైడ్ పోలింగ్ జరిగినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. తాము పోలింగ్ వెళ్లిన చోట దాదాపు 60 నుంచి 70 శాతం వరకు టీడీపీకే ఓట్లు పడ్డాయని చెబుతున్నారు. చాలా మంది ప్రభుత్వం మార్పు వైపే మొగ్గు చూపారని అంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

అనంతపురం రూరల్, మే 15: నగరంలో పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-1 డీఈఈ నాగేంద్ర తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హౌసింగ్ బోర్డ్ కాలనీ, విద్యుత్ నగర్, ఓబుళదేవర నగర్, నాయక్ నగర్, ఆదర్శనగర్, అశోక్ నగర్, జీసస్‌నగర్, సాయినగర్‌లో విద్యుత్ సరాఫరా ఉండబోదన్నారు.

చీనీకాయలు టన్ను రూ.36 వేలు

అనంతపురంరూరల్, మే 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.22 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 470 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నేరేడు చెట్లకు గడ్డి మందు

శింగనమల, మే 15: మండలంలోని కొరివిపల్లి గ్రామ రైతు బాల చౌడప్పకు చెందిన నేరేడు చెట్లుకు గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేయడంతో అవి ఎండిపోయాయి. ఈ మేరకు శింగనమల పోలీస్ స్టేషన్‌లో చౌడప్ప బుధవారం ఫిర్యాదు చేశాడు. కొరివిపల్లి రెవెన్యూ పొలంలో సర్వే నెంబర్ 76-3లో చౌడప్ప ఐదు సంవత్సరాల నుంచి 220 నేరేడు చెట్లు సాగు చేస్తున్నాడు. ఈ సంవత్సరం కాపు వచ్చింది. వారం కిందట గుర్తుతెలియని వ్యక్తులు ఆ చెట్లుకు గడ్డి మందు పిచికారి చేయడంతో ఆ చెట్లు ఎర్రగామారి ఆకులు రాలిపోయి ఎండిపోయాయి. దీంతో తాను రూ.4 లక్షలు నష్టపోయానని చౌడప్ప వాపోతున్నాడు.



కొరివిపల్లిలో ఎండిన నేరేడు చెట్టు

ముగిసిన మార్కెట్ కమిటీల గడువు

అనంతపురంరూరల్, మే 15: జిల్లాలో పలు మార్కెట్ కమిటీ పాలక వర్గాల గడువు ముసింది. జిల్లా మార్కెటింగ్‌శాఖ పరిధిలో తొమ్మిది మార్కెట్ కమిటీలున్నాయి. ఇందులో రాప్తాడు మార్కెట్ కమిటీ పాలక వర్గం గడువు సెప్టెంబరు 22తో ముగిసింది. కళ్యాణదుర్గం, ఉరవకొండ మార్కెట్ కమిటీల పాలక వర్గం గడువు గత నెల 24వ తేదీతో ముగిసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. అలాగే అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం గడువు ఈనెల 8వ తేదీతో ముగిసింది. ఆ తరువాత మళ్లీ పాలక వర్గాల ఏర్పాటు జరగలేదు. అదేవిధంగా రాయదుర్గం మార్కెట్ కమిటీ గడువు ఈనెల 20న ముగియనుంది. తాడిపత్రి ఈ నెల లోనే ముగియనుంది. శింగనమల, గుత్తి, గుంతకల్లు మార్కెట్ కమిటీల పాలకవర్గం గడువు జూలైలో ముగియనుంది.

ముందస్తు అడ్మిషన్లను కట్టడి చేయాలి: ఏఐఎస్ఎఫ్



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం విద్య, మే 15 : జిల్లాలో స్కూళ్లు, కళాశాలల్లో సాగుతున్న ముందస్తు అడ్మిషన్లను వెంటనే అధికారులు కట్టడి చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావే శంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు ఇష్టారాజ్యంగా చేస్తున్నాయన్నారు. మే లో ఒక రకం ఫీజు, జూన్‌లో మరో రకం ఫీజు అంటూ చెబుతూ... విద్యార్థుల తల్లిదండ్రులను మాయ చేస్తున్నారని తెలిపారు. కొన్ని స్కూళ్లకు అనుమతులు లేకున్నా.... ఇబ్బడిముబ్బడిగా ఫీజులు పెంచేసి... అడ్మిషన్లు చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికే కొన్ని స్కూళ్లలో అడ్మిషన్లు పూర్తి చేశారని, నిబంధనలు ఉల్లంఘించిన స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓ, ఆర్ఐఓ కార్యాలయ అధికారులు ఎన్నికల డ్యూటీలో ఉండటం వల్ల యాజమాన్యాలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముందస్తు అడ్మిషన్లపై, అనుమతులు లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మంజునాథ్, ఉమామహేష్, వంశీ, హరికృష్ణ, రారాజు, సమీర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అనంతపురం ప్రెస్‌క్లబ్ : శ్రీ వెంకటరమణస్వామి బోర్‌వెల్స్ సంఘ సభ్యుడు శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. దీంతో ఆ సంఘం అధ్యక్షుడు దలవా యి మారెప్ప, వైస్ ప్రెసిడెంట్ దలవాయి వెంకటనారాయణ ఆధ్వర్యంలో రూ.1.50 లక్షలను బుధవారం ఆ సంఘం కార్యాలయంలో శ్రీనివాసులు కుటుంబసభ్యులకు అందజేశారు. వారు మాట్లాడుతూ... బోర్‌వెల్స్‌లో పనిచేస్తూ అనేక మంది ప్రమాదవశాత్తు మరణిం చారని, వైసీపీ ప్రభుత్వం వారి కుటుంబాలకు ఎలాంటి ఆర్థికసాయమూ చేయలేదని అన్నారు. తామే సంఘం తరఫున బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. బోర్‌వెల్స్ పనిచేస్తున్న వారికి టీడీపీతోనే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, కదిరప్ప, బాల అంకన్న, చిన్న వెంకటరాముడు, శీనా, గోవిందు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

కొనసాగిన క్రికెట్ లీగ్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 15: అనంతపురం ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2 పోటీల్లో పలు జట్లు గెలుపొందాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఏపీఎల్-2 క్రికెట్ పోటీలు బుధవారమూ కొనసాగాయి. దినేష్ గ్రానైట్స్, యునైటెడ్ చాంపియన్స్ క్రికెట్ క్లబ్ జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన దినేష్ గ్రానైట్స్ 18.5 ఓవర్లలో 144 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన యునైట్ చాంపియన్స్ 17.5 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దినేష్ గ్రానైట్ బౌలర్ తన్వి జవాల్ నాలుగు వికెట్లు తీసి 26 పరుగుల తేడాతో సాధించిన విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరో మ్యాచ్‌లో అనంత రైజింగ్ స్టార్స్, ఇండియన్ సిక్సర్స్ జట్లు మధ్య జరగగా... నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లుకు 169 పరుగులు సాధించింది. అనంతరం బరిలోకి 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 157 పరుగులు మాత్రమే సాధించి ఓటమి పాలైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన ఇండియన్ సిక్సర్స్ జట్టు సభ్యుడు సంపత్‌కు సభ్యులు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.



సంపత్‌కు బహుమతి అందజేస్తున్న సభ్యులు

ఎస్కేయూ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో వీసీ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, మే 15: ఎస్కేయూ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టును ఎంపిచేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ సెక్రెటరీ శ్రీనివాసన్ పేర్కొన్నారు. బెంగళూరు యూనివర్సిటీ సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటి టోర్నమెంట్ పోటీలను నిర్వహిస్తోందని, వీటిలో పాల్గొనేందుకు ఎస్కేయూ పరిధిలోని కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించామని అన్నారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. కాగా, ఎంపికైన ఆ విద్యార్థులను బుధవారం వీసీ హుస్సేన్‌రెడ్డి అభినందించి క్రీడా దుస్తులు అందజేశారు.

విషాహారం తిని 12 గొర్రెలు మృతి

నార్పల, మే 15: నార్పలలోని చైతన్య కాలనీలో బుధవారం గొర్రెలు కాపరి మరిమేకలపల్లి ఆదెప్పకు చెందిన 12 గొర్రెలు విషాహారం తిని మృతి చెందాయి. ఆదెప్ప తన గొర్రెలను పొలాల వైపు మేతకు తీసుకెళ్లారు. అయితే అక్కడే ఉన్న ఒక తోటలో మందులు కొట్టిన దానిమ్మ పండ్లు తిని అక్కడికక్కడే కింద పడిపోయి మృతి చెందాయి. సుమారు రూ.1.30 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.



టి వీరాపురంలో తాగునీటి సమస్య



కొళాయి వద్ద ఖాళీ బిందెలను ఉంచిన మహిళలు

రాయదుర్గంరూరల్, మే 15: మండలంలోని టీ వీరాపురం గ్రామ బీసీకాలనీలో గత రెండునెలల నుంచి తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నట్లు కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామానికి ఆరు పంచాయతీ బోర్లతో తాగునీటిని అందిస్తున్నారు. అయినప్పటికీ బీసీ కాలనీకి నీరు రావడం లేదన్నారు. బీసీకాలనీలో కొంతమంది ఇంట్లోకి మోటారు ద్వారా నీటిని తోడుకోవడంతో మరికొన్ని ఇళ్లకు నీటి సమస్య ఎదురైందన్నారు. ప్రతి రోజూ కరెంట్ వచ్చినప్పుడు మాత్రమే అరకొరగా వస్తున్నట్లు తెలిపారు. దాదాపు 300 ఇళ్లకుపైగా ఉన్నప్పటికీ పై భాగాన మోటార్ల ద్వారా నీటిని తోడుకోవడంతో చాలా ఇళ్లకు నీరు రాకఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గేట్‌వాల్వ్ లేకపోవడంతోనే నీటి సమస్య ఏర్పడిందని కాలనీవాసులు వాపోతున్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

గుమ్మఘట్ట, మే 15: మండలంలోని బీటీపీ గ్రామంలో మూడు రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా అందించడం లేదని మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన చేశారు. అధికారులు గానీ, పంచాయతీ పాలక వర్గం సభ్యులు గానీ తాగునీటి సమస్య గురించి పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక పంచా యతీ కార్యదర్శి జోక్యం చేసుకుని వెంటనే తాగునీటి సమస్యను తీరుస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బాకీ సొమ్ము అడిగినందుకు దాడి



గాయపడిన శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్, మే 15: పట్టణంలోని భాగ్యనగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసులుపై అతడి ఇంటి ఎదురుగా ఉన్న షాహిన్‌షా తోపాటు మరో నలుగురు బుధవారం కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు శ్రీనివాసులు స్థానిక ధర్మవరం గేట్ వద్ద సెల్‌ఫోన్ షాపు నిర్వహిస్తున్నాడు. షాహిన్‌షాకు ఇల్లు నిర్మించుకునేందుకు ఏడాది కిందట శ్రీనివాసులు, అతడి తల్లి మస్తానమ్మ రూ. 5లక్షలు అప్పుగా ఇచ్చారు. మంగళవారం రాత్రి శ్రీనివాసులు తల్లి మస్తానమ్మ షాహిన్‌షా ఇంటి వద్దకెళ్లి డబ్బులు ఇవ్వాలని అడిగింది. ఇస్తానని చెప్పి అతను ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం షాహిన్‌షా ఇంటి వద్దకు మస్తానమ్మ వెళ్లి డబ్బులు ఇవ్వాలని అడిగింది. ఈ విషయంపై ఇరువురు గొడవ పడుతున్నారని శ్రీనివాసులు అక్కడికి వెళ్లాడు. షాహిన్‌షా అతడి భార్య షహనాజ్ నంద్యాల నుంచి మౌలాలి, మణి, అమూల్‌ను పిలిపించి కట్టెలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో శ్రీనివాసులు తలకు గాయాలయ్యాయి. గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై వన్‌టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

దాడులను ఆపండి: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి టౌన్, మే15: పట్టణంలో రెండురోజులుగా టీడీపీ, వైసీపీ నాయకులు చేస్తున్న దాడులను ఆపాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ కోరారు. పట్టణంలోని నెహ్రూపార్కు ఆవరణలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇరుపార్టీల దాడులతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిరువ్యాపారులు, వ్యాపారస్తులు ఘర్షణలకు భయపడి స్వచ్ఛందంగా షాపులను మూసివేస్తున్నారని తెలిపారు. ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితులు పట్టణంలో నెలకొన్నాయన్నారు. శాంతిభద్రతలు కాపాడే పోలీసులకే రక్షణ కరువైందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ సహాయ కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు రమణ, నూరి పాల్గొన్నారు.

రేపు లక్ష్మీనారాయణస్వామి రథోత్సవం

రాయదుర్గం రూరల్, మే 15: పట్టణంలోని లక్ష్మీబజార్‌లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణం, రథోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం 11.46 గంటల నుంచి 12.38 నిమిషాల వరకు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 5.15 గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు.

ఇరువర్గాలపై కేసు

తాడిపత్రిటౌన్, మే15: పట్టణంలో మంగళవారం జరిగిన రాళ్లదాడికి సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు బుధవారం పట్టణ పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిలతోపాటు ఇరువర్గాలకు చెందిన పలువురిపై కేసు నమోదుచేశామని తెలిపారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్

కళ్యాణదుర్గం, మే 15: ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గంలో బెట్టింగ్‌ల జోరు ఎక్కువగా సాగుతోంది. ఫలితాలకు ఇంకా 20 రోజులు సమయం ఉండటంతో ఆయా పార్టీల అభిమానులు పందేలకు సిద్ధమవుతున్నారు. బహిరంగంగా లక్షల పందేలకు సవాళ్లు విసురుతున్నారు. మాట చెబితే సరిపోదు బాండ్ పేపర్ రాసిస్తావా అంటూ మాటల యుద్ధాన్ని మొదలు పెట్టారు. కళ్యాణదుర్గం, రూరల్, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండల కేంద్రాల్లో గెలుపుపై పందాలు జోరందుకున్నాయి. ఎక్కువగా మెజార్టీపైనే పందాలు జరుగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నా యి. పోలింగ్ పూర్తి కాక ముందే కుందుర్పి మండలంలో రాష్ట్రంలో కూటమి గెలుస్తుందని, స్థానిక ఎమ్మెల్యే గెలుపుపై పందేలు వేసుకున్నట్లు తెలుస్తోంది.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా




సింగానహళ్లిలో ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్, మే 15: మండలంలోని కళ్లుదేవనహళ్లి, సింగానహళ్లి, ఉద్దేహాళ్ గ్రామాల శివార్లలో వేదవతి హగరినది ఇసుకను కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. వైసీపీకి చెందిన కొందరు ఈ అక్రమ ఇసుక వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నా సంబంధిత అధికారులు ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు అయిపోతే ఏంటి జూన్ 4 వరకు తామే అధికారంలో ఉంటామన్న ధీమాతో వైసీపీకి చెందిన కొందరు ఇతర గ్రామాలకు జోరుగా ఇసుకను తరలిస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక రూ. నాలుగు వేల నుంచి రూ. ఆరు వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ఇసుక తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శలు వస్తున్నాయి.

ప్రశ్నార్థకంగా ఎస్ఎస్ ట్యాంకు భద్రత



గట్టు నుంచి ఊడిపోయిన బండలు



కుంగిపోయిన చెరువు గట్టు

ఉరవకొండ, మే 15: మండలంలోని నింబగల్లు సమీపంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు గట్టు భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గత మూడేళ్ల నుంచి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.40లక్షలతో చెరువు మరమ్మతుల ప్రతిపాదనలు చేశారు. అయితే అవి ప్రతి పాదనలకే పరిమితమయ్యాయి. సీపీడబ్ల్యూఎస్ స్కీంకు చెందిన మూడో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు గట్టు బలహీన పడ్డాయి. గట్టు పైభాగంలో మట్టి కట్ట మొత్తం నెర్రెలు చీలి 4అడుగుల లోతు మేరకు కుంగిపోయింది. దీంతో ఎప్పుడు తెగిపోతుందో అన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. 1997లో సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నిర్మించారు. ట్యాంకుల భద్రతపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే కాలువ గట్టు కుంగిపోయింది. మూడేళ్ల కిందట గట్టు కుంగిపోయిన ప్రాంతంలో తాత్కలిక మరమ్మతులు చేశారు. ట్యాంకు నీటి నిల్వ సామర్థ్యం ఆరు మీటర్లు కాగా ఐదు మీటర్లకు మించి నీటిని నిల్వ చేసే పరిస్థితులు కనబడటం లేదు. చెరువులో గట్టుకు అడ్డంగా వేసిన బండలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో గట్టు భద్రత ప్రశ్నార్థకమవుతోంది. చెరువు మొత్తం పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయింది. అధికారులు స్పందించి గట్టు భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో బేల్దారి మృతి



మృతి చెందిన బోయప్రసాద్

గుంతకల్లుటౌన్, మే 15: పట్టణ శివారు బళ్లారి రోడ్డులోని ఓ పొలంలో బేల్దారి బోయ ప్రసాద్(40)బుధవారం అనుమానాస్పద స్థితిలో బుధవారం మృతి చెందాడు. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు పాతగుంతకల్లులోని అంకాలమ్మ వీధిలో బోయ ప్రసాద్ నివాసముంటున్నాడు. ఈయన బేల్దారి పని చేస్తూ జీవించేవాడు. మంగళవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ప్రసాద్ రాత్రి 8గంటలకు మేనల్లుడైన మస్తాన్‌కు పెట్రోల్ తీసుకురావాలని, కల్వరి టెంపుల్ వద్ద ఉన్నానని ఫోన్ చేశాడు. దీంతో మస్తాన్ పెట్రోల్ తీసుకుని అక్కడికి వెళ్లి ప్రసాద్‌కు ఫోన్ చేశాడు. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో చుట్టుపక్కల వెతికి ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం కృష్ణారెడ్డి పొలంలో ప్రసాద్ నిర్జీవంగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి గొంతు మీద వైర్‌తో బిగించగా నల్లగా మారింది, ముక్కులో నుంచి రక్తం వచ్చింది, శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పోలీసులు గుర్తించారు. ఎవరో హత్య చేసి పొలంలో పడేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య కవిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బీరప్ప స్వామి ఆలయంలో చోరీ యత్నం

గుంతకల్లుటౌన్, మే 15: పట్టణంలోని పాతగుంతకల్లులోని బీరప్ప స్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నం చేశారు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపిన మేరకు మంగళవారం రాత్రి ఆలయంలో దుండగులు చొరబడి సీసీ కెమెరాల వైర్లను కట్ చేశారు. ఆలయంలో ఉన్న హుండీని సుత్తితో, ఇనుపరాడ్‌లతో పగలకొట్టేందుకు యత్నించారు. హుండీ తెరచుకోకపోవడంతో చేయి పెట్టి కొంత డబ్బును తీసుకెళ్లారన్నారు.. అనంతపురం నుంచి పోలీస్ క్లూస్ టీం వచ్చి నిందితుల వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్కమాంబ ఆలయంలో చోరీ

కళ్యాణదుర్గంరూరల్, మే 15: పట్టణంలోని అక్కమాంబ ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు ఆలయంలోని హుండీలను మంగళవారం రాత్రి దొంగలు పగలగొట్టి దాదాపు రూ. రెండు లక్షల నగదును దొంగిలించుకుని వెళ్లారు. మూడు హుండీలలో ఉన్న నగదును దొంగిలించి ఒక హుండీని దేవాలయం ఎదుట వదిలి వెళ్లిపోయారు. అయితే దేవాలయంలోకి ప్రవేశించే ప్రధాన ద్వారం గేట్లు పగులగొట్టి, తాళం చెవి తీసి లోపలికి ప్రవేశించినట్లు ఆనవాళ్లు ఉండటం గమనార్హం. ఆలయ కమిటీ చైర్మన్ రాము ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాయలంలో వేసవి శిక్షణ ప్రారంభం

గుంతకల్లుటౌన్, మే 15: పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ శిబిరాన్ని చిత్రకారుడు శ్రీధరన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కమ్మన్న మాట్లాడుతూ పిల్లలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, చదువు మీద ఆసక్తి పెంచడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5-15సంవత్సరాల వయస్సు గల పిల్లలకు చిత్రలేఖనం, వివిధ రకాలైన ఆటపాటలలో శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇస్తారన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని వినతి

పుట్లూరు, మే15: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలకు ట్యాంకర్లను పెంచి తాగునీటి సమస్యను తీర్చాలని టీడీపీ నాయకులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కాలనీవాసులతో కలిసి బుధవారం సమస్యను విన్నవించారు. రోజూ మూడు ట్యాంకర్లు వస్తున్నాయని చెబుతున్నారే కానీ ఒక్కటి కూడా వచ్చింది లేదని మండిపడ్డారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా కాటన్ జయంతి



కాటన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బ్రహ్మసముద్రం, మే 15: మండలకేంద్రంలోని గ్రంథాలయంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రాజన్న మాట్లాడుతూ గోదావరినదికి ఆనకట్టను నిర్మించి రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చిన ఘనత కాటన్‌కే దక్కుతుందన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రతి గ్రామంలో కాటన్ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజిస్తున్నారంటే ఆయన సేవలు ఎంత అమూల్యమైనవో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలంలో మోస్తరు వర్షం

బొమ్మనహాళ్, మే 15: మండలంలో మంగళవారం రాత్రి మోస్తరు వర్షం కురిపిస్తుంది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. 13 మి.మీ. వర్షపాతం నమోదైంది. కురిసిన వర్షంతో వ్యవసాయ భూముల్లో కొంతమేర నీరు నిలిచింది. బొమ్మనహాళ్‌తో పాటు ఉద్దేహాళ్, కురవళ్లి, నేమకల్లు తదితర గ్రామాలలో వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. రాత్రి పెద్ద చినుకులు వర్షం రావడంతో వర్షాకాలం వచ్చినట్లే అని రైతులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



అలీ బాషా(ఫైల్)

పామిడి, మే 15: పట్టణంలోని తలవాలకట్ట వీధిలో నివాసం ఉంటున్న కట్టుబడి అలీబాషా(28) బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని తలవాలకట్ట వీధికి చెందిన కట్టుబడి నబీసాబ్, మునీరా దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు అలీబాషా బేల్దారి పని, చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో కుటుంబంలో కలహాలు తలెత్తాయన్నారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి తల్లి, తండ్రి, భార్య ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెళుగుప్పలో పోలీస్ పికెట్



సిబ్బందితో కలిసి బెళుగుప్పలో తిరుగుతున్న ఎస్ఐ శివ

బెళుగుప్ప, మే 15: బెళుగుప్పలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ శివ బుధవారం తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం సమీపంలో పోలింగ్ రోజు ఇరు పార్టీల వర్గీయుల గొడవకు దిగిన విషయం తెలిసిందే. దీంతో శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం ఏపీఎస్‌పీ పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశామన్నారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరు పార్టీల నాయకుల మీద కేసు నమోదు చేశామన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

విడపనకల్లు, మే 15: మండల ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఉరవకొండ ఏరియా యూనిట్ మలేరియా అధికారి బత్తుల కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులపై అవగాహనా కార్యక్రమాన్ని మలేరియా అధికారి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను తట్టుకోవాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా దోమలు నివారణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు లేకుంటే ఎట్ల బతికేది?

మండల మీట్‌లో తాగు నీటి సమస్యపై నిలదీత

ఉరవకొండ, మే 15: ఇరవై రోజులకు ఒక్కసారి నీటిని వదిలితే ఏమి తాగుతారని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎంపీటీసీ సభ్యుడు నిలదీశాడు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశభవనంలో మండల సర్వసభ్యసమావేశాన్ని ఎంపీపీ నరసింహులు అధ్యక్షత నిర్వహించారు. నీళ్లు అడిగితే ఎలక్షన్ కోడ్ అంటూ అధికారులు నీటిసమస్యను పట్టించుకోవడంలేదని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యపై మండల కమిటీ ద్వారా ఉన్నతాధికారు లకు ప్రతిపాదనలు పంపి సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఏఈ ఫమీద ఫర్వీన్ తెలిపారు. నీటి వనరులను బట్టి తాగు నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు. వేసవి అయిపోయిన తర్వాత సరఫరా చేస్తే ఏం ప్రయోజన మని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.3 కోట్లతో ఉపాధి పనులకు ప్రతిపాదనలు పంపామని, అనుమతులు కూడా తీసుకున్నామన్నారు. జాబ్ కార్డులు తొలగిస్తున్నారని సభ్యులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌తో లింక్ కాకపోతే తొలగించినట్లు తెలిపారు. విద్యాహక్కుచట్టాన్ని ప్రైవేట్ పాఠశాలలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పుస్తకాలను అధిక ధరలకు అమ్ముతున్నా విద్యాశాఖాధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవరిస్తున్నారన్నారు. నెరమెట్ల జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభం కూలిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచు యోగేందర్ రెడ్డి ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సుశీలమ్మ, జడ్పీటీసీ పార్వతమ్మ, ఎంపీడీఓ అమృత్‌రాజ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా డబ్బులు వెనక్కి ఇప్పించండి: హౌసింగ్ లబ్ధిదారులు



హౌసింగ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

యాడికి, మే15: 'కాంట్రాక్టర్‌ను నమ్మి మోసపోయాం. మేము చెల్లించిన అదనపు డబ్బులను మాకు వెనక్కి ఇప్పించండి' అంటూ పలువురు హౌసింగ్ లబ్ధిదారులు బుధవారం హౌసింగ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. హౌసింగ్ కార్యాలయంలో ఉన్న ఏఈ ప్రశాంత్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఇల్లు కట్టించి ఇస్తాము, అదనంగా డబ్బులు చెల్లించమంటే కాంట్రాక్టర్‌కు రూ.35 వేలు చెల్లించామన్నారు. మా డబ్బులు మాకు వెనక్కి ఇప్పించండని డిమాండ్ చేశారు. 2023డిసెంబరు నాటికి ఇల్లు పూర్తిచేసి ఇస్తామని మొదటి చెప్పారని, 2024 మేనెల వచ్చినా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టర్‌ను సోమవారం పిలిపిస్తామని అదనపు డబ్బులు కట్టిన వారందరూ అప్పుడు వస్తే మీ డబ్బులు మీకు వెనక్కి ఇచ్చేలా మాట్లాడుతామని తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గుంతకల్లుటౌన్, మే 15: మండలంలోని బుగ్గసంగాల గ్రామంలో వెలసిన బుగ్గసంగమేశ్వర స్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ.105261లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ క్రిష్ణయ్య తెలిపారు బుధవారం ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. ఐదు నెలలకు సంబంధించి రూ.1,05,261 లు, అన్నదానం హుండీ ద్వారా రూ.4,133లు ఆదాయం వచ్చిందన్నారు. టెంకాయ పూజా సామగ్రి అమ్ముకొనేందుకు వేలం వేయగా రూ. 1,12,000లు, అన్నదానానికి ఉపయోగపడని బియ్యం వేలం వేయగా కేజీ రూ.17.50లతో పాడారన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అర్చకులు మంజునాథ్‌స్వామి, సంపత్‌స్వామి పాల్గొన్నారు.

కూటమి విజయం ఖాయం: జయరాం



మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

గుత్తి,మే15: టీడీపీ నాయకులు, కార్యకర్తల కృషి వల్ల విజయం సాధించబోతు న్నట్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ జన్మదిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. కష్టపడిన కార్యకర్తలకు అండగా ఉంటానని ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానని గుమ్మనూరు కుటుంబ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గుమ్మనూరు ఈశ్వర్, బీఎస్ కృష్ణారెడ్డి, బద్రివలి, బండారు ఆనంద్, పత్తిహిమబిందు, కేశవనాయుడు, నరేంద్రచౌదరి, నారాయణస్వామి, ఎంకేచౌదరి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం ఖాయమని మాజీ జడ్పీటీసీ వాణి జగన్నాథ్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు సల్లాపురం బాబు అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరం అని తెలిపారు. ఉంతకల్లు వద్ద రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందని కాలవ శ్రీనివాసులుపై నమ్మకంతో ప్రజలు అండగా నిలిచారని తెలిపారు.

ప్రతి కార్యకర్తకు టీడీపీ అండ



పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న నాయకులు

బెళుగుప్ప, మే 15: ప్రతి టీడీపీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు భరోసా ఇచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ ఆవులెన్న నారాయణ స్వామి, పెద్ద తిప్పయ్య, కన్వీనర్ ప్రసాద్, మల్లికార్జున, దుద్దేకుంట తిమ్మప్ప, త్రివేది నాయుడు మాట్లాడుతూ మీరందరు ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లా పని చేశారన్నారు. వైసీపీ నాయకుల కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని, సంయమనం పాటించాలని సూచించారు. పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన మీ సహాయం మరువలేనిదని, అధికారం కూటమిదే అని, ధైర్యంగా ఉండాలని సూచించారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఉందని, గొడవలకు దిగవద్దని తెలిపారు.

పోలింగ్ ముగిసినా తప్పని ఓటర్ల తాకిడి

కణేకల్లు, మే 15: ఎన్నికల పోలింగ్ ముగిసి రెండు రోజులు కావస్తున్నా రాజకీయ నాయకులకు మాత్రం ఓటర్ల తాకిడి తప్పడం లేదు. అనేక మంది ఓటర్లు తాము మీ పార్టీకే ఓట్లు వేశామని, తమకు మీ పార్టీ వారు సొమ్ములు అప్పట్లో ఇవ్వలేదని, ఇప్పుడైనా తమకు ఓట్ల డబ్బులు ఇవ్వాలని వెంట పడుతున్నారు. ఎన్నికల ముందురోజుతో పాటు ఎన్నికల రోజు కూడా ఇతర ప్రాంతాల నుంచి ఓట్లు వేసేందుకు సొంత గ్రామాలకు వచ్చారు. అప్పటికే ఆయా రాజకీయ పార్టీలు ఓటర్లకు నగదు పంపిణీ కార్యక్రమం పూర్తి చేసుకున్నారు. కానీ ఆలస్యంగా వచ్చిన ఓటర్లు పోలింగ్ బూత్‌లలో ఓట్లు వేసి నేరుగా ఆయా బూత్‌లకు సంబంధించిన ఇరుపార్టీల నాయకుల వద్దకు వెళ్లి తాము మీ పార్టీకే ఓటు వేసేందుకు అదే పనిగా అక్కడి నుంచి వచ్చామని తమకు నగదు అందజేయాలని కోరుతున్నారు. ఈ పరిస్థితిని చూసి అనేక మంది రాజకీయ నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

బస్సులు రాక ఇబ్బందులు

యల్లనూరు, మే15: తాడిపత్రిలో మంగళవారం సాయంత్రం జరిగిన సంఘటన నేపథ్యంలో మండలానికి వచ్చే బస్సులు రద్దు చేయడంతో ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. బస్సులు రాకపోవడంతో జీపులు, ఆటోల్లో వెళ్లాలని ప్రయాణికులు భావించినప్పటికి వాటిని కూడా పుట్లూరు మండలంలోని గూడూరు వద్దనే ఆపివేస్తున్నారని తెలిసి వెనక్కి వెళ్లిపోయారు. తాడిపత్రి నుంచి మండలానికి విధుల నిమిత్తం వచ్చే ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడ్డారు.

ఎటుచూసినా పోలీసులే



పోలీస్‌స్టేషన్ వద్ద బలగాలు

తాడిపత్రిటౌన్, మే15: వరుసగా రెండురోజులపాటు జరిగిన దాడులు, ప్రతిదాడుల దృష్ట్యా పోలీసు శాఖ అప్రమత్తమైంది. భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. దీంతో పట్టణంలో ఎక్కడచూసినా పోలీసులే కనిపిస్తున్నారు. ప్రధాన రహదారులైన సీబీరోడ్డు, యల్లనూరురోడ్డు, పుట్లూరురోడ్డు ప్రాంతాల్లో బందోబస్తు పటిష్టం చేశారు. పట్టణ శివారు ప్రాంతాలైన కడపరోడ్డు, అనంతపురంరోడ్డు, బుగ్గరోడ్డు, చుక్కలూరురోడ్డులో పోలీసు పికెటింగ్‌లను ఏర్పాటుచేశారు. పట్టణంలోకి కొత్త వ్యక్తులు రాకుండా తనిఖీలు నిర్వహించిన అనంతరం అనుమతి ఇస్తున్నారు.

సీబీఎస్ఈ పదిలో వంద శాతం ఉత్తీర్ణత

గుంతకల్లుటౌన్,మే15: సీబీఎస్ఈ పది ఫలితాల్లో పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాలయం ప్రధానోపాధ్యాయులు ఎస్ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. సీబీఎస్ఈ ఫలితాలలో రామిశెట్టి హనన్య 500 మార్కులగాను 473 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

నెలాఖరు వరకూ ఫీజు చెల్లింపు అవకాశం

ఉరవకొండ,మే15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 4వ, 6వ సెమిస్టర్ పరీక్షలకు ఈ నెలాఖరు లోపు ఫీజు చెల్లించవచ్చునని ప్రిన్సిపాల్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 24 నుంచి 29 వరకూ ఆరో సెమిస్టర్ పరీక్షలు ఉంటాయన్నారు. జూలై 3 నుంచి 9 వరకూ నాలుగో సెమిస్టర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 7382929762 నెంబర్ సంప్రదించవచ్చునన్నారు.